క్లుప్తంగా

కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

సీతానగరం: స్థానిక కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ యన్నమనేని రామచంద్రరావు, డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ 200 మందికి వైద్యసేవలు అందించారు. రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో జరిగిన వైద్యశిబిరంలో 128 మందికి వివిధ పరీక్షలు జరిపి, మందులు అందజేశారు. పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి శిబిరంలో 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఏడుగురికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని శస్త్రచికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చినకొండేపూడికి చెందిన కర్లపూడి శేఖర్ (బుల్లిబాబు) దంపతులు భోజన ఏర్పాట్లకు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వై.వెంకట నారాయణ, వి.మెహర్ మధు, పడాల చారిటబుల్ ట్రస్ట్ పి.సూర్యప్రకాశ్, జి.పద్మావతి, కె.శ్రీనివాస్, చంటిబాబు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

సీతానగరం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ సోమవారం తెలిపారు. చినకొండేపూడి శివారున దేవీపట్నం మండలం నేలకోటకు చెందిన చుండ్రు ఉమామహేశ్వరరావు మద్యం అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి ఐదు బీరు సీసాలు, పది విస్కీ క్వాటర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రామచంద్రపురం శివారు పురుషోత్తపట్నం జగనన్న కాలనీకి చెందిన కటికిల శ్రీనున మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. 34 బ్రాంది క్వాటర్ సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

శిక్షణతో ఆర్థిక ప్రగతి సాధించాలి



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో నిర్వాహకులు

రాజానగరం: పొందిన శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను పెంచుకుంటూ ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ప్రగతిని సాధించాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని తోకాడలో 50 మంది మహిళలకు మగ్గం వర్కులో ఇస్తున్న శిక్షణా తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా దివాన్ చెరువులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద సోమవారం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు సుంకర వీరాస్వామి, వినీల, గెస్ట్ నాగేంద్ర కిషోర్, ట్రైనర్ ఈపూరి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసులు

సీతానగరం: మండలంలోని కాటవరం, జాలిమూడికి చెందిన ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామని ఏఎస్సై సమర్పణరావు సోమవారం తెలిపారు. జాలిమూడికి చెందిన యడ్ల అచ్చియ్యమ్మ కుమారుడు, మరిదితో కాటవరానికి చెందిన కందుకూరి వెంకన్న, కందుకూరి ప్రదీప్‌లతో పాటుగా మరికొందరు డబ్బుల విషయంలో ఘర్షణ పడుతున్నారు. వారిని నివారించడానికి మధ్యలోకి వెళ్లిన అచ్చియ్యమ్మపై కర్రలతో దాడి చేయగా గాయపడింది. ఈ మేరకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కాటవరానికి చెందిన యడ్ల రాంబాబు తనను కొట్టాడని కందుకూరి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెటూళ్లకు ప్రగతి రథం

మధురపూడి: పల్లెటూళ్లకు ప్రగతి రథాన్ని తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. కోరుకొండ మండలం బుచ్చెంపేట గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి గణేష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు కక్ష సాధింపునకు పరాకాష్ఠే ఎన్నికల కమిషన్ పింఛన్ల పంపిణీలో లేకుండా చేయడమన్నారు. దీనివల్ల అవ్వాతాతలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు.కాగా.. టీడీపీకి చెందిన మద్దాల రాముడు, మంచాల నరసింహ, చిర్రా చినలాజరు, జనసేనకు చెందిన మద్దాల వెంకన్న, జొన్నకూటి ప్రవీణ్‌లతో పాటు 20 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దాల చంటిబాబు, జొన్నకూటి వందన కుమార్ పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో గ్రామాల ప్రగతి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కొండగుంటూరుపాకలులో ప్రచారం



కొండగుంటూరుపాకలులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కొండగుంటూరుపాకలులో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాల గురించి ఆరా తీస్తూనే, గడచిన ఐదేళ్ల పాలన ఏవిధంగా ఉంది, సంక్షేమ పథకాలు సక్రమంగా అందాయా, ఏవిధమైన సమస్యలున్నాయా అంటూ ఆరా తీశారు. గ్రామాభివృద్ధికి గతంలో ఏ ప్రజాప్రతినిధి చేపట్టని విధంగా కోట్లాది రూపాయలు వెచ్చించామని, రాబోయే కాలంలో మరొక అవకాశం ఇస్తే, మరింత ప్రగతిని చేసి చూపడంతో పాటు సమస్యలనేవి లేకుండా చేస్తానన్నారు. ఒకప్పుడు వేసవి వస్తుందంటే చాలు తాగునీటి సమస్య వస్తుందని భయపడేవారని, కానీ నేడు ఆ పరిస్థితులు రాకుండా, పుష్కలంగా నీటిని అందిస్తున్నామన్నారు.

నవరత్నాలతో మహిళల అభ్యున్నతి

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ తెలిపారు. మండలంలోని ముగ్గళ్లలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మహిళలకు బొట్టుపెట్టి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ నవరత్నాలతో పాటు అనేక పథకాలను ప్రవేశపెట్టి పేదలకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రాజానగరం అభివృద్ధిని విస్మరించిందన్నారు. జగన్ పాలనలో వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పథకాలు పేదల ఇంటి ముంగిటకు చేరాయన్నారు. ముగ్గళ్లలో సుమారు రూ.4 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా డాక్టర్ శ్రీనివాస్, ఎమ్మెల్యేగా తన భర్త జక్కంపూడి రాజాను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే రాజాతో పాటు మరో ముగ్గురం మీకు అందుబాటులో ఉండి, సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు, పార్టీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, పార్టీ నాయకులు సాదె చంటిబాబు, చల్లమళ్ల సుజీరాజు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, ఆళ్ల కోటేశ్వరరావు, మల్లిన చౌదరి, దేశాబత్తుల సుబ్రహ్మణ్యం, గుర్రాల స్వామి, గుర్రాల కృష్ణరావు, మాగాపు సుబ్రహ్మణ్యం, కాట్రగడ్డ వెంకట్రావు, కూచిపూడి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



ముగ్గళ్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ



నరేంద్రపురంలో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

జోరుగా ఎన్నికల ప్రచారం

రాజానగరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రగతి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆ పార్టీ నాయకుడు వడ్డి చిన్న అన్నారు. రాబోయే ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లూ వేసి, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ మేరకు సోమవారం నరేంద్రపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ



అడపా గంగరాజుకు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం పరామర్శించారు. పితృ వియోగంతో బాధపడుతున్న నరేంద్రపురానికి చెందిన చాట్ల వెంకన్న, మద్దూరి వెంకట భాస్కర్, నాయనమ్మ మృతితో బాధలో ఉన్న మండవరపు తాతాజీ, అదే గ్రామానికి చెందిన బాపిరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే టి.ధర్మరాజు కుటుంబ సభ్యులను, టి.మణికంతను ఓదార్చారు. కోరుకొండ మండలం కోటిలో మాతృ వియోగంతో బాధపడుతున్న మండల కన్వీనర్ అడపా కనకరాజు, గట్టి కనకం కుటుంబ సభ్యులను, మధురపూడిలో ఆకుల కాశీ కుటుంబ సభ్యులను, గుండపల్లి విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు ఉన్నారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థికి అభినందనలు



నవోదయకు ఎంపికైన గౌతమ్‌ను అభినందిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు



బిక్కవోలు ఎంఈఓ కార్యాలయం వద్ద విద్యార్థి కార్తీక్‌ను అభినందిస్తున్న ఎంఈఓ-1 సీహెచ్ సత్యనారాయణ

బిక్కవోలు: జవహర్ నవోదయకు ఎంపికైన కొమరిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి కసిరెడ్డి వెంకట కార్తీక్ కుమార్‌ను స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓ-1 సీహెచ్‌వీ సత్యనారాయణ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తిక్ ఎంపిక కావడం వెనక ఉపాధ్యాయులతో పాటు అతడి తల్లిదండ్రులు గోవింద్, వరలక్ష్మిల కృషి ఎంతో ఉందన్నారు. నవోదయలో చదువుకోవడం వల్ల విద్యార్థి భవిష్యత్ ఎంతో బాగుంటుందన్నారు. కార్యక్రమంలో కర్రి శ్రీనివాస్‌రెడ్డి, కె.దేవిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

రంగంపేట: నవోదయ విద్యాలయకు ఎంపికైన సింగంపల్లి శ్రీవిద్యా యూపీ స్కూల్ విద్యార్థి కొండేపూడి సత్య ఆదిత్య నీల గౌతమ్‌ను ఎంఈఓలు శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సోమవారం అభినందించారు. గౌతమ్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

శహపురంలో ప్రచారం

పెదపూడి: మండలంలోని శహపురంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజల మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ తరఫున అనపర్తి టిక్కెట్ మొదట తనకు కేటాయించడంతో ప్రచారం చేసుకున్నానని, ఇప్పుడేమో బీజేపీ అభ్యర్థికి సీటు ఇచ్చామంటున్నారన్నారు. మీ అందరి మద్దతు తనకు కావాలని అడిగారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సభలకు అనుమతి తప్పనిసరి

ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్



రంగంపేట: సాధారణ ఎన్నికల నేపథ్యంలో సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి అని రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ కె.కిషోర్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సెక్షన్-30 పోలీస్ యాక్ట్ అమలు ఏప్రిల్ 30వ తేదీ వరకూ పొడిగించామన్నారు. కావున ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదన్నారు. ఎక్కడ సభలు నిర్వహించాలన్నా ముందస్తుగా రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించాలన్నారు.

బిక్కవోలు: ఊరేగింపులు, సమావేశాలకు పార్టీల నేతలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ పి.బుజ్జిబాబు సోమవారం తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వసతుల పరిశీలన

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సోమవారం స్థానిక గౌతమీ జీవకారుణ్య సంఘం వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ వసతులు, సదుపాయాలను పరిశీలించిన అనంతరం పిల్లలు, వయోవృద్ధులతో మాట్లాడి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న సదుపాయాలలో ఏదైనా అసంతృప్తి ఉంటే తెలియజేయాలని సూచించారు. వేళకు భోజనం చేస్తూ మందులు వేసుకోవాలన్నారు. వారికి అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పిల్లలకు, వయోవృద్ధులకు పౌష్టిక ఆహారంతో పాటు వేసవి కాలం ముగిసే వరకు మజ్జిగ అందించాలని ఆశ్రమ సిబ్బందికి సూచించారు. వృద్ధులకు, పిల్లలకు ఎండ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అధిక దిగుబడినిచ్చే వంగడాలు ఎంచుకోవాలి



వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

రాజానగరం: వ్యవసాయంలో నిరంతర పరిశీలనతో పాటు అధిక దిగుబడినిచ్చే వంగడాలను ఎంచుకోవడం ఎంతో అవసరమని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ హైమజ్యోతిలతో కలిసి సోమవారం కోరుకొండ మండలంలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ నూతన వంగడాలను సమష్టిగా సాగు చేయడం వల్ల నాణ్యమైన, స్థిరమైన ఉత్పత్తిని పొందవచ్చన్నారు. అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలైన ఎంటీయూ 1271, ఎస్ఎల్ఆర్ 3238 (నెల్లూరు రకం), బీపీటీ 2846 (బాపట్ల రకం) రకాలను వ్యవసాయ యూనివర్సిటీ కేంద్ర స్థాయి కమిటీ ద్వారా ఇటీవల విడుదల చేసిందన్నారు. గోదావరి జిల్లాలలోని మెట్ట ప్రాంతంలో సాగుకు ఎంటీయూ 1271 సార్వాలో బీపీటీ 5204 రకానికి ప్రత్యామ్నాయమన్నారు. 140 రోజులలో కోతకు వచ్చే ఈ వంగడం ఎండాకు తెగులు, దోమ కాటును పాక్షికంగా తట్టుకుని, హెక్టారుకు ఏడు టన్నుల వరకూ దిగుబడి ఇస్తుందన్నారు. ప్రస్తుత దాళ్వా పంటలో ఎంటీయూ 1121, ఎంటీయూ 1318 రకాలను సాగు చేసిన క్షేత్రాలను కూడా సందర్శించామని, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు.

కోటికేశవరంలో..

మధురపూడి: కోరుకొండ మండలం కోటికేశవరం గ్రామంలోని రైతులతో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సోమవారం ఇష్టాగోష్ఠి నిర్వహించారు. సాగులో నూతన రకాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మారుటేరులోని వ్యవసాయ పరిశోధనాస్థానంలో ఎంటీయూ 1,271 రకం విడుదల చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, హైమజ్యోతి పాల్గొన్నారు.

ముగ్గురు ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు



అవార్డు అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, సకాలంలో సమస్యలను గుర్తించి ప్రమాదాలు జరుగకుండా సిబ్బందిని అప్రమత్తం చేసిన విజయవాడ డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ ద మంత్ జీఎం సేఫ్టీ అవార్డులు' వరించాయి. సోమవారం దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో ఏజీఎం ధనుంజయులు విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్‌ల డీఆర్ఎంలతో భద్రతా చర్యలపై వర్చువల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ క్రమం తప్పకుండా సేఫ్టీ డ్రైవ్‌లు, రాత్రుళ్లు సెక్షన్‌లలో తనిఖీలు చేపట్టాలన్నారు. విధుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ వ్యవస్థలో లోపాలను గమనించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డ్స్ ఫిబ్రవరి-2004కి ఎంపికైన ఉద్యోగులను ఏజీఎం ప్రకటించారు. విజయవాడ డివిజన్ నుంచి ఎంపికైన రాజమహేంద్రవరంలో టెక్నీషియన్ ఎస్ఎస్ బ్రహ్మణ్యం, కాకినాడ పోర్టులో గూడ్స్ లోకో పైలట్ కేవీవీఎస్ నారాయణ, విజయవాడ ట్రాలీ మెన్ వి.వీరలింగేశ్వరరావులకు డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తన కార్యాలయంలో జీఎం అవార్డులను అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రతిపక్షాల తీరుతో వలంటీర్ల రాజీనామా

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలకు సేవ చేస్తున్న తమపై రాజకీయ పార్టీలు నిందలు వేస్తున్నాయని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రూరల్ మండలంలోని ఎనిమిదిమంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. హుకుంపేట మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. శాటిలైట్ సిటీ సచివాలయం-3కు చెందిన రుంకాని విజయలక్ష్మి, లబ్బా కృష్ణవేణి, గొడ్డి ఉమామహేశ్వరరావు, చెక్కా అపర్ణ, లంకా సంతోషిణి, హుకుంపేట సచివాలయం -2కి చెందిన సందిపర్తి లావణ్య, పొట్టింగ నాగమణి, చిట్టిబోయిన లక్ష్మి రాజీనామా చేశారు.

కడియం మండల పరిధిలోని వేమగిరి నుంచి నలుగురు, కడియపులంక నుంచి ఒక వలంటీరు సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్‌కు అందజేశారు.

సమాజ సేవలో రజకుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: సమాజ సేవలో రజకుల పాత్ర అత్యంత కీలకమని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక రజకుల కల్యాణ మండపంలో సోమవారం జిల్లా రజక సంఘాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భరత్‌రామ్ మాట్లాడుతూ రజకులలోని ఐక్యత, తోటి వారికి సహాయ సహకారాలు అందించే తీరు అభినందనీయమన్నారు. ఎంపీగా నగరాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దానని, ఎమ్మెల్యేగా మీరు ఆశీర్వదించి గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నగరంలో గ్లో గార్డెన్ ఇండియాలోనే రెండవ అతిపెద్దదన్నారు. అలాగే కంబాల చెరువు పార్కును అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. నగరంలోని సుబ్రహ్మణ్యం మైదానం ఒకప్పుడు గంజాయి, మద్యం, జూదగాళ్లకు అనువైన స్థలంగా ఉండేదని, దానిని ఓపెన్ ఎయిర్ థియేటర్ గా ఎంతో చక్కగా అభివృద్ధి చేశామన్నారు. పుష్కర ప్లాజా, ఈట్ స్ట్రీట్, హ్యాపీ స్ట్రీట్ ఇలా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసుకుంటూ వచ్చామన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నగరానికే తలమానికం కాబోతోందన్నారు. ఆ వంతెనను ఈ నెలాఖరున నగర వాసులచే ప్రారంభించి జాతికి అంకితం ఇవ్వబోతున్నట్టు తెలిపారు. రజకులకు కమ్యూనిటీ హాలు కావాలని కోరారని, ఎమ్మెల్యే కాగానే మీ కోరిక తప్పక నెరవేర్చే బాధ్యత నాదేనన్నారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, మాజీ కార్పొరేటర్ పోలు విజయలక్ష్మి, పార్టీ నగర అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు, రజక సంక్షేమ సంఘ నాయకులు బొమ్మదేవర శ్రీనివాస్, పొలమూరి వెంకట్రావు పాల్గొన్నారు.

అడుగడుగునా నిఘా..

- ఎన్నికల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు
- పోలీస్ యాక్ట్ 30 అమలు
- అనుమతి లేకుండా సభలు నిర్వహిస్తే చర్యలు



ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేస్తున్న ఎస్పీ జగదీష్, పోలీసులు (ఫైల్)

కంబాలచెరువు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తుగా ఈనెల ఒకటో తేదీ నుంచి సెక్షన్ 30 అమలులోకి వచ్చింది. ఎన్నికల బందోబస్తు కోసం నగరానికి కేంద్ర బలగాలు చేరుకున్నాయి. రాజమహేంద్రవరంలో గత ఎన్నికల్లో సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పలు చోట్ల ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది పర్యవేక్షణలో కేంద్ర బలగాలు కవాతు చేస్తున్నాయి. దీనిలో భాగంగా రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కేంద్ర బలగాలు పర్యటిస్తున్నాయి. ఎన్నికల్లో ఆటంకాలు సృష్టించేందుకు ప్రయత్నించే అరాచక శక్తుల ఆట కట్టించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు పంపుతున్నారు. ఇప్పటికే అన్ని స్టేషన్లకు సంబంధించి పోలింగ్ బూత్ వివరాలు, గతంలో అల్లర్లు జరిగిన ప్రాంతాల వివరాలు పోలీసులు సేకరించి ఆయా ఘటనలకు కారణమైన నాయకులు, కార్యకర్తలకు నోటీసులు పంపుతున్నారు. నిత్యం ఏదొక ప్రాంతంలో కవాతు నిర్వహించి ప్రజలకు ధైర్యం కల్పిస్తున్నారు. రౌడీషీటర్లు, సెటిల్‌మెంట్ గ్యాంగ్‌లతో పాటు ఎన్నికల నేరగాళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఎస్పీ పి.జగదీష్ ప్రత్యేక కార్యక్రమం రూపొందించారు.


30 వరకూ పోలీస్ యాక్ట్ అమలు

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుంది. రాజమహేంద్రవరంతో పాటు, ధవళేశ్వరం, బొమ్మూరు, కడియం, రాజానగరం ప్రాంతాల్లో సెక్షన్ 30 అమలులో ఉంటుంది. యాక్ట్ అమలులో ఉన్నంత కాలం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదు. అటువంటివి నిర్వహించాలంటే పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

యువకులకు కౌన్సెలింగ్

ప్రజా శాంతికి భంగం కలిగిస్తున్న వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కడియం దేవీ సెంటర్‌లో ఘర్షణకు పాల్పడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఘటనకు పాల్పడిన ఎనిమిది మంది యువకులను గుర్తించి, పెద్దల సమక్షంలో పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ విషయం తెలిసిన జిల్లా ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్‌ను ఆదేశించారు. ఒకసారి క్రిమినల్ కేసుల్లో పేర్లు నమోదు అయితే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఉంటాయని, ఆ విషయాన్ని యువత మర్చిపోవద్దని హితవు పలికారు.


నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు అందరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి. ఎటువంటి కార్యకలాపాలు చేయాలన్నా, ఊరేగింపులు నిర్వహించాలన్నా తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలి. మా పరిధిలో పూర్తి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం. ఎవ్వరూ కవ్వింపు చర్యలకు పాల్పడరాదు. ఆ విధంగా ప్రవర్తిస్తే ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడం. దీన్ని అందరూ గమనించాలి. ఎవరైనా అలా ప్రవర్తిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

– అంబికా ప్రసాద్,
సౌత్ జోన్ డీఎస్పీ, రాజమహేంద్రవరం.

మృతి చెందిన యువకుడి వివరాలు లభ్యం



పాతర రాజబాబు (ఫైల్)

కంబాలచెరువు: డివైడర్‌ను ఢీకొట్టి మృతి చెందిన యువకుడిని రంపచోడవరానికి చెందిన పాతర రాజబాబు (32)గా పోలీసులు గుర్తించారు. మూడో పట్టణ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. రంపచోడవరానికి చెందిన పాతర రాజబాబు రాజమహేంద్రవరంలోని స్నేహితుడి ఇంటిలో జరిగే ఫంక్షన్‌కు ఆదివారం ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. సరిగ్గా మార్కెట్ యార్డు సమీపంలో రాత్రి సుమారు 10 గంటలు దాటిన తర్వాత డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రాజబాబు తలకు గాయమై తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాల కోసం ఆరా తీశారు. ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు విషయ తెలిపారు. తండ్రి పాతర చిన్నబ్బాయికి రాజబాబు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.